www.jananinadam.com
RNI NO:TGTEL/25/A0870
Follow:

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

మంగళవారం 14-07-2026
సంపుటి: 2 సంచిక: 78

ఆసిఫాబాద్
Asifabad

హైదరాబాద్
Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్
Editor: JADAV ROHIDAS

పేజీలు : 04
వెల: రూ.2.00

Simultaneously published from
, Asifabad, Karimnagar, Adilabad ,
www.jananinadam.com



## యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి...

**విద్యార్థుల్లో కులవి వక్షను దూరం చేస్తున్నాం ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సిఎం రేవంత్**

**హైదరాబాద్ 13:** జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్ను పెంచుతున్నామని

## స్వలాభం కోసం కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

**ఎన్టీఆర్ ప్రాపకం కోసమే కొడుక్కు తారకరామారావు పేరు**

**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపాటు**



**హైదరాబాద్,జూలై13:** కెసిఆర్ రాజకీయ జీవితమంతా పావ పంకిలమేనని, అవసరానికి తగ్గట్లుగా ఊసరవెల్లి తీరులో నడిచిన ఘనుడని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్ ది అంటూ వ్యాఖ్యానించారు. ఎన్టీఆ ర్ ను కాకా పట్టేందుకు కొడుకు పేరును తారకా రామారావు అని పెట్టుకున్నాడని అన్నారు. మంత్రి పదవి రాలేదనే కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. చంద్రబాబు కూడా మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టారని అన్నారుపార్టీ పెట్టి ఎలక్షన్లు, కలెక్షన్లు చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదా హం, ధనదాహం, అధికార దాహం ఉందని విమర్శించారు. అందుకే గత



## మొగుళ్ళపల్లి దక్కిన అరుదైన గౌరవం.

**గిన్నిస్ బుక్ వరల్డ్ రివార్డ్ లో గోల్డ్ మెడల్ సాధించిన రిత్విక్ తేజాతో పాటు మరో ముగ్గురుచిన్నారులను అభినందించి క్యాష్ రివార్డ్ ను అందజేసిన మంత్రి కొండా సురేఖ.**

**జయశంకర్ భూపాలపల్లి.13:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి అరుదైన గౌరవం దక్కింది. అతి చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్ రంగంలో తెలుగు రాష్ట్రాల కీర్తిని, భారతదేశ ప్రతిష్టతను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి, గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ లోకి ప్రవేశించి..గోల్డ్ మెడల్ సాధించి..పలువురి ప్రముఖులచే అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మూగ రాజ్ కుమార్ తనయుడు మూగ రిత్విక్ తేజాను, మరియు వరల్డ్ రికార్డ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో ముగ్గురి చిన్నారులను తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. కంప్యూటర్ యుగంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్న అతి చిన్న వయసు పిల్లలను చూసి మంత్రి సురేఖ సంబరపడ్డారు. అదేవిధంగా చిన్నారులు మారుమూల ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా నలుగురి చిన్నారులకు క్యాష్ రివార్డ్ అందజేశారు. అలాగే అటు చదువులో ఇటు మార్షల్స్ రంగంలో తనదైన ముద్ర వేసేలా ప్రోత్సహిస్తున్న రిత్విక్ తేజా తండ్రి, ఏఆర్ కానిస్టేబుల్ రాజకుమార్ ను మంత్రి సురేఖ, బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ లు అభినందించారు. అనంతరం మంత్రి చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని, వారు అన్ని రంగాల్లో రాణించే విధంగా దృష్టి సారించాలని, నేటి విద్యార్థుల భవిష్యత్తే..రేపటి తెలంగాణ అభివృద్ధికి పునాదులు కావాలని, ఆ విధంగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.




## ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ 13:** జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్ దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు. బోనాల ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు విడుదల. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారుల సమన్వయం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ

**జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమీక్ష**



**సిద్ధిపేట13:** అధికారులు సమన్వయంతో పనిచేయాలని: జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, వారానికి కనీసం ఒకసారి ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ డ్రైవ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, స్పెషల్ ఆఫీసర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు హాస్టళ్లు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి శాఖ తప్పనిసరిగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొంటూ, ఈ ఏడాది కూడా ప్రతి ఉద్యోగి ఒక మొక్కను నాటేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అలాగే విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి, పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు



## సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్...

**గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు**

**అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది.**

**సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై13:** సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్ లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. ..మిగతా 2 లో...



## సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం...

2వ పేజీలో...

**బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక**

**గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు**

**మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు**

**సంగారెడ్డి, జూలై 13:** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కావాలనే లోపాలతో కూడిన కేసునుకాంగ్రెస్ చేస్తున్నట్లు చూపించుకోవడానికి దేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్



## ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

2వ పేజీలో...

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 13:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు ప్రజలు సమన్వయంతో సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అవగాహన పోస్టర్లలో మీ ఓటు మీ బాధ్యత అనే నినాదంతో కొత్త ఓటరు నమోదు పేరు తొలగింపు వివరాల సవరణ పోలింగ్ కేంద్రం మార్పు డూప్లికేట్

# నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి..

## గురుకుల పాఠశాలలో మాత్రల పంపిణీ ప్రారంభించిన కలెక్టర్ కె.హరిత



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 13:** జిల్లాలో 19 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారి, యుక్తవయస్కుడు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థంగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణతో పిల్లల్లో పోషకాహార లోపం తగ్గి, శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన పిల్లలే చదువులో రాణించి మంచి భవిష్యత్తు నిర్మించుకోగలరని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు అందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే పోషకాహారం అందించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులతో ఆహారం తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన సాగించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్ర, వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం

# అధికారులకు కలెక్టర్ కె. హరిత ఆదేశం



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 13:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే వినతులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సిర్పూర్ (టి) మండలం భూపాలపట్నానికి చెందిన మంగెన భూదేవి వితంతు పింఛన్ మంజూరు చేయాలని, దహేగాం మండలానికి చెందిన భుతే దేవేందర్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడకు చెందిన గెడం పద్మ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం అందించాలన్నారు. సిర్పూర్ (టి) రైల్వే కాలనీకి చెందిన గాదె సుభద్ర గృహజ్యోతి పథకం రాయితీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటకు చెందిన దుర్గం కావేరి తన పిల్లలకు గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించాలని విన్నవించారు.కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన చాపిడి సరోజ మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా ఉపాధి కల్పించాలని కోరారు. దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కొట్లూరి దుర్గా గౌడ్ తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు చేసి పాసుపుస్తకం జారీ చేయాలని దరఖాస్తు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థకు మూలస్తంభాలు కలెక్టర్ కె. హరిత




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 13:** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ప్రాథమిక విద్యేనని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించే ప్రాథమిక ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు మూలస్తంభాలని కలెక్టర్ కె. హరిత అన్నారు.జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల రిసోర్స్ పర్సన్స్ (ఎంఆర్పీలు) కోసం నిర్వహిస్తున్న మూడు రోజుల జిల్లా స్థాయి సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారిలో చదవడం, రాయడం, గణించడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించే కీలక బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు.ఉపాధ్యాయులకు వినూత్న బోధనా పద్ధతులు, సమగ్ర బోధన, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, అభ్యసన ఫలితాల మెరుగుదల వంటి అంశాలపై ఈ శిక్షణలో మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు. జూలై 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎంపికైన ఎంఆర్పీలు పాల్గొంటున్నారని చెప్పారు.ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కోర్సు ఇన్‌చార్జి అడే ప్రకాశ్, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు, వివిధ మండలాల నుంచి ఎంపికైన ఎంఆర్పీలు పాల్గొన్నారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్...

మొదటిపేజీ తరువాయి...

మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్ గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి దారితీసిందని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు మిగిల్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి...

మొదటిపేజీ తరువాయి...

వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి...

విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభంజూలై 20,21,22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం,21న అమ్మవారికళ్యాణం, 22 న రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు,ఆగస్టు 3న రంగం కార్యక్రమంఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల తో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సులను నడిపిస్తున్నందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు

## ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి

# అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

మొదటిపేజీ తరువాయి...

ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ జూలై 24తో ముగుస్తుందని ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా ఓటరు నమోదు చేసుకునే అర్హులు అలాగే పేరు చిరునామా ఇంటి నంబర్ వయస్సు ఫోటో తదితర వివరాల్లో మార్పులు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలను కూడా ఈ సర్వే ద్వారా పూర్తి చేసుకోవచ్చని ఎమ్మెల్యే వివరించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అందువల్ల ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అవుతుందని అనంతరం అభ్యంతరాలు సవరణలకు ఆగస్టు నుంచి అక్టోబర్ 24 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 31న విడుదల కానుందని వెల్లడించారు ఈ సర్వే ప్రక్రియ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్న ఎమ్మెల్య రేషన్ కార్డులు పెన్షన్లు తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను కూడా ప్రజలు సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సర్పంచులు వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.ఎస్ఐఆర్ సర్వే పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని రాజకీయాలకు అతీతంగా ప్రజాహిత దృక్పథంతో సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మేయర్ దర్నీ మధుకర్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్య నారాయణ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ తూముల నరేష్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గజ్జెల హేమలత ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం...

మొదటిపేజీ తరువాయి...

మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్లు చెయ్. నేను తిట్టినట్టు చేస్తా అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాసు కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరుల పై అవగాహన తక్కువ.ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2026 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2020న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్‌వీసీ పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసంబ్లీని సమావేశపరచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకేఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం డిగివర్స్ దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ కూడా 2600 క్యూసెక్కుల నీటిని ఎత్తాలి ఉండగా, కేవలం 6 మోటర్లను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా వెలుతున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది. ఎవరో భక్తి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకాక కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన సర్పంచ్‌లు



**జననినాదం, సిరికొండ 13:** బషీర్‌బాగ్‌లోని పరిశ్రమ భవన్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను పలువురు గ్రామ సర్పంచ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయిగూడ గ్రామ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్‌రావు, లక్షెట్టిపేట సర్పంచ్ కోట్నక్ వనిత, ఈశ్వర్‌నగర్ సర్పంచ్ రాథోడ్ శారద, గదిగూడ సర్పంచ్ గోడం నర్మద, సీతాగొంది సర్పంచ్ తమ్మల అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

## స్వలాభం కోసం కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పరిమితం చేశారన్నారు. తెలం గాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఎంపీ తెలిపారు. తెచ్చింది కాంగ్రెస్ నేతలన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు బీఆర్ఎస్ మైందని అంటూ ఆరోపించారు. కారణ పిట్ట కథలు చెప్పి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని మండి పడ్డారు. కమీషన్లు దండుకోవడం తప్ప ఎకరానికి కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని వ్యాఖ్యా నించారు. 'పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది' అంటూ కేసీఆర్ను ఉద్దేశించి సెటైర్ విసిరారు. 2009లో కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగు లను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే అని.. ఈటల రాజేందరు ఎంపీగా గెలిపించింది బీఆర్ఎస్ అంటూ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పిం చారు. అందుకే బిజెపి ఎంపి ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ గొంతుతో మాట్లాడుతున్నారని అన్నారు. కాళేశ్వరం పేరుతో నిధులు దండుకున్న వీరు మళ్లీ దానిగురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు.

# నులి పురుగుల నివారణకు ఆల్బెండాజోల్ తప్పనిసరి

**ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్ఓ మహేష్**

**జాతీయ డివార్మింగ్ డే సందర్భంగా రాయిగూడలో విద్యార్థులకు మాత్రల పంపిణీ**

జననినాదం,సిరికొండ 13: నులి పురుగుల నివారణకు ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్ఓ మహేష్ అన్నారు. జాతీయ డివార్మింగ్ డే సందర్భంగా సోమవారం సిరికొండ మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ఆల్బెండాజోల్ మాత్రలు కడుపులోని నులి పురుగులను నివారించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి జాతీయ డివార్మింగ్ డే కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుశీల, హెల్త్ అసిస్టెంట్ గంగారం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జననినాదం
మంగళవారం 14 జూలై 2026

# రాష్ట్ర అథ్లెటిక్స్‌లో బెల్లంపల్లి క్రీడాకారుల ప్రతిభ

అక్షయకు బంగారం.. చిన్మయికి కాంస్యం

**జననినాదం, బెల్లంపల్లి 13:** తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని స్పోటోపియా స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో ఆడిచర్ల అక్షయ, అరుసం చిన్మయి చైత్రిక, ఎడ్ల త్రినయ్ పాల్గొన్నారు. స్టాండింగ్ లాంగ్‌జంప్‌లో ఆడిచర్ల అక్షయ 1.61 మీటర్లు దూకి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 60 మీటర్ల పరుగు పందెంలో అరుసం చిన్మయి చైత్రిక మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. 300 మీటర్ల పరుగు పందెంలో ఎడ్ల త్రినయ్ ఐదో స్థానంలో నిలిచాడు.వీరికి సల్వాల సంతోష్ యాదవ్ కోచ్‌గా శిక్షణ అందించారు. విజేతలను మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఈ. మారయ్య అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.




# పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి

**ఏఐసీసీ కార్యదర్శి ఆదిత**

**జననినాదం, ఆసిఫాబాద్ 13:** కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి ఆదిత అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, ఏఎంసీ చైర్మన్ ఇరుకుల మంగ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ఐక్యతతో పనిచేస్తే కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కున సురేష్, నల్లూరి రాజేష్, జక్కన్న, ఏఎంసీ డైరెక్టర్, డీసీసీ కార్యదర్శి గద్వేని మల్లేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల కోసం మహిళల వినతి

**సర్వేకు ఎమ్మెల్యే ఆదేశం**

**జననినాదం,బోథ్ 13:** వర్షాకాలంలో గుడిసెల్లో నివాసం ఉండటం దుర్భరంగా మారిందంటూ బోథ్ మండలంలోని కరత్వాడ గ్రామ మహిళలు సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆశ్రయించారు. తమ గుడిసెల దయనీయ పరిస్థితిని ఫొటోల ద్వారా చూపించి, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. మహిళల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి గ్రామంలో వెంటనే సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అర్హుల వివరాలను త్వరితగతిన సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ద్వారా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**ఎంపీడీఓ నాగేష్**

**జననినాదం, తిర్యాణి 13:** పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని తిర్యాణి ఎంపీడీఓ నాగేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఎదులపాడ్ గ్రామంలో పర్యటించిన ఆయన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పీఎం జన్‌మన్ గృహాలను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, సేవలపై ఆరా తీశారు. పిల్లల ఆరోగ్యం, పోషణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం చిన్న అరటిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) సర్వేను పరిశీలించిన ఆయన ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయాలని, సర్వేను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. నర్సరీని పరిశీలించి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడావి పార్వతి అంబారావ్, గ్రామ కార్యదర్శి కోట్టే అశోక్, కారోబారి రామకృష్ణ, ఆశ వర్కర్ ప్రమిల తదితరులు పాల్గొన్నారు.



# నీళ్ల కోసం రోడెక్కిన మహిళలు

**ధరంపల్లిలో నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా -- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన**

**జననినాదం,చింతలమానేపల్లి/ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 13:** జిల్లాలోని చింతలమానేపల్లి మండలం ధరంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా కావాల్సిన తాగునీరు రెండు నెలలుగా అందకపోవడంతో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు.గ్రామంలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో తాగునీటి కోసం మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోజువారీ పనులు సైతం ఇబ్బందికరంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.





ఖాళీ బిందెలను రోడ్డుపై ఉంచి నిరసన చేపట్టిన మహిళలు, గ్రామానికి వెంటనే మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.గ్రామస్తుల నిరసనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధర్మపల్లి గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# తెలంగాణ భాషలో పలుకుబడులు !!

తెలంగాణ భాష, యాస మరియు అందులోని పలుకుబడులు మన ప్రాంత సంస్కృతికి ,చారిత్రక వైభవానికి మరియు ప్రజల జీవన విధానానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. శతాబ్దాల కాలంగా వివిధ రాజరికాల పాలన , ముఖ్యంగా నిజాం నవాబుల పాలన ప్రభావం వల్ల తెలంగాణ తెలుగు భాషలు ఉర్దూ, పర్షియన్, మరాఠీ, కన్నడ పదాలు సహజంగా కలిసిపోయి, ఒక విలక్షమైన రూపాన్ని సంతరించుకున్నాయి. మన తెలంగాణ భాషా కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమే కాదు; అది ఆయా అంతలా శ్రమజీవుల స్వేదం, ఉనికి , మట్టి వాసన మరియు ఆత్మీయతల కలయిక. తెలంగాణ పలుకుబడులలో కనిపించే నిష్కల్మషత్వం, అందులోనే సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు నిత్య జీవితంలోని కష్టసుఖాలను హస్యాన్ని, వ్యంగాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తాయి.తెలంగాణ భాష పలుకుబడులు అంటే ముఖ్యంగా చెప్పాల్సింది ఏమిటంటే మన తెలంగాణ పల్లెల్లో జీవన విధానంలో నిత్యం మాట్లాడుకునే స్వచ్ఛమైన సహజమైన తెలుగు భాష నుడికారాలని తెలియజేయవచ్చు. ఇవి కేవలం పదాలు మాత్రమే కాకుండా వాటి ఉచ్చారణలో ఉండే విలక్షణతను, సంస్కృతిని, ఆచారాలను, సంప్రదాయాలను, జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, పలుకుబడులు అనేవి మన తెలంగాణ మట్టి పరిమళాన్ని, జీవన విధానాన్ని, తెలంగాణ వైభవాన్ని, ప్రత్యేకతను చాటుతాయి. ఇవి సామాన్యుడి హృదయానికి హత్తుకుని నుడికారాలుగా నిమగ్నమైపోయాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు 9న తెలంగాణ భాషా దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తారు. “తెలంగాణ రచయిత కాళోజీ నారాయణరావు 100వ జయంతి సందర్భంగా.. కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.” తెలంగాణ ప్రజల గుండె చప్పుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.ఈ ప్రత్యేక రోజున తెలంగాణ భాష, సాహిత్యం మరియు సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, పాఠశాలలు మరియు కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కవి కాళోజీ నారాయణరావు చేసిన సాహిత్య సేవలను, తెలంగాణ మాండలికం యొక్క గొప్పతనాన్ని ఈ వేడుకల్లో గుర్తుచేసుకుంటారు. ఈ దినోత్సవం సందర్భంగా ఉత్తమ కవులు, రచయితలకు తెలంగాణ ప్రభుత్వం కాళోజీ పురస్కారం అందజేసి సత్కరిస్తుంది. ఈవిధంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు అన్నట్లు ”బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాలి.” దక్కన్ పీఠభూమి చరిత్ర సంస్కృతి, నిజాం పాలన ప్రభావం వల్ల ఉర్దూ పదాలు కూడా ఈవిధంగా మన తెలంగాణ భాషలో చేరినాయి.ఇప్పుడున్న తెలుగు వ్యవహారిక భాష పూర్తిగా సంస్కృతమయై ఉంది. తెలంగాణ భాషలో ఎలాంటి అస్పష్టత లేదు. కారణం దేశీయ పద్ధతిలో తెలుగును గానం చేసే మౌలిక తత్వం, శ్రమైక జీవన సంస్కృతి, మానవీయమైన ఆదాన ప్రదనాలను తావునిచ్చే సహృదయత తెలంగాణ గడ్డలో ఉంది. ఇక్కడి జీవన విధానంలో నిస్వార్థ చింతన ఉంది. అందుకే తెలంగాణ పేరు సార్థకమైంది. తెలంగాణ భాషా పదాల సొగసు, మాధుర్యం,సృజనాత్మకత, మౌలికత, సార్థకత తెలంగాణ మట్టి వాసనాలు భాషాపరమైన అనేక విషయాల్లో ఇతర భాషలతో పోల్చుకుంటే తెలంగాణ తెలుగు భాషలో స్పష్టత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఖ, ఘ,ఛ,ఝ,ఠ,ఢ,థ, ధ,ఫ,భ మొదలగు మహాప్రాణాలు వాటి ప్రయోగాలు ద్రావిడ భాషల్లో లేనట్లే తెలంగాణ తెలుగులో లేవు. క,చ,ట,త,ప, లు అనే శ్వాసాలే కొన్నిసార్లు నాదాలుగా ఉచ్చరింపబడ్తాయి. తెలుగు భాషలో ఇవి గ,జ,డ,ద,బ లుగా మారుతుంటాయి. తెలంగాణ తెలుగు భాషలో శ,ష,స లకు మధ్య భేదం కనిపించదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాష ఒక కీలక పాత్ర పోషించింది. ఉద్యమ సందర్భంగా అచ్చమైన తెలంగాణ పలుకుబడిలో కెసిఆర్ చేసిన ప్రసంగాలు తెలంగాణ సమాజాన్ని ఉత్తేజపరిచాయి. సీమాంధ్ర పాలకుల హయాంలో తెలంగాణ పలుకుబడిలో ఎవరైనా మాట్లాడడానికి వెనుక ముందు ఆడేవారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ భాషను ఆయుధంగా చేసుకుని కెసిఆర్ ఉద్యమాలోకి దిగారు. అడుగడుగునా తెలంగాణ భాషలో సాగే కెసిఆర్ ప్రసంగాలు తెలంగాణ ప్రజలకు కట్టి పడేశాయి. “నీళ్లు, నిధులు, నియామకాలు” ప్రధానంగా ఈ మూడు అంశాలపై తెలంగాణ ప్రజలు ఉద్యమించారు. ఈ మూడే కాదు తెలంగాణ ఉద్యమానికి బలమైన కల్చరల్ కోణం కూడా ఉంది. అనేక ప్రత్యేకతను సొంతం చేసుకున్న తెలంగాణ భాషకు ఇతర సాంప్రదాయాలకు సరైన గుర్తింపు లభించడం లేదన్న ఆవేదన కూడా ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో తెలంగాణ భాషకున్న ప్రాధాన్యం ప్రత్యేకమైంది.తెలంగాణ ప్రజలు ఎంతో అర్థవంతమైన భాష మాట్లాడుతున్నారు. ఉదాహరణకు మేర పదానికి ఇతర ప్రాంతాల వారు దర్జీ అంటారు. ఇది ఉర్దూ పదం వాస్తవానికి తెలంగాణలో వాడే మేర పదాన్ని పరిశీలిస్తే పొలిమేర, ఆమేరకు, ఈమేరకు అనే మౌఖిక ప్రయోగాలు తెలంగాణలో ఉన్నాయి. మేరల అనగా హద్దులమేరకు అని ఉంది. అనగా మేర వారు గుడ్డల్ని కత్తిరించి కుట్టే వ్యక్తిమేర. ఇది అసలు సిసలు తెలుగు పదం. సోయి, సోయిలేదు, సోయిసుద్ధి, సోయిసెప్పటం లాంటివన్నీ తెలుగు పదాలు. ఈ విధంగా తెలంగాణ తెలుగు భాషా సౌందర్యంలో కొన్ని స్పష్టమైన విలక్షణత్వాలను గుర్తించవచ్చు. భాషలో అచ్చమైన తెలుగు పోకడలు ఇక్కడ ఉన్నాయి. తెలంగాణ తెలుగులో ఉర్దూ పదాలు అత్యంత జమిలిగా రీతిలో కలగలసి పోవటం గొప్ప విశేషం. తెలంగాణ తెలుగులో దీర్ఘాలు బాగా పొడవైన సమాసాలు సంస్కృత పదా భూయిష్టమైన తీరుతెన్నులు బాగా తక్కువ. నలిమెల భాస్కర్ ‘తెలంగాణ పదకోశం’ లో అనేక పదాల కూర్పు జరిగింది. తెలంగాణ పద సౌందర్యాన్ని కొంతవరకు బయలు ఏర్పగలిగిన అయినా ఇట్లా అంటాడు. “ఏ భాషకైనా జవజీవాలు, జాతీయాలు సామెతలే!... తెలంగాణ వాసుల పలుకు పలుకులో నుడికారం ఉంటుంది. చల్లగా ఉండేది చల్ల (మజ్జిగ), ఎర్రగా ఉండేది ఎర్ర (వానపాము), లాగుతూనే వేసుకునేది లాగు = ప్యాంటు, అంగాన్ని కప్పి ఉంచేది = అంగి, కంకుతూ తింటం గనుక కంకి. ఇలాంటి మాటలెన్నో నలిమెల భాస్కర్ మనమందు ఉంచాడు. అదేవిధంగా “గుమ్మి” అనేది ప్రముఖ తెలంగాణ కథా రచయిత మరియు నవలాకారుడైన డా. కాలువ మల్లయ్య రచించిన ఒక విశిష్టమైన పుస్తకం. తెలంగాణ అస్తిత్వ చైతన్యం, అక్కడి జీవన విధానంపై విస్తృతంగా రచనలు చేసిన ఆయన, ఈ పుస్తకం ద్వారా స్థానిక భాషా సంపదను అక్షరబద్ధం చేశారు. ఈ పుస్తకం “తెలంగాణ వాడుక భాషా పలుకులు, పలుకుబడులు” అనే అంశంపై రాయబడింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం మాట్లాడే విలక్షణమైన పదాలు, సామెతలు, జాతీయాలు మరియు మరుగున పడిపోతున్న పలుకుబడులను ఇందులో పొందుపరిచారు. ‘గుమ్మి’ అంటే తెలంగాణ పల్లెల్లో ధాన్యాన్ని దాచుకునే పెద్ద బుట్ట లేదా నిల్వ పాత్ర. పల్లె ప్రజల నోట పలికే అమూల్యమైన భాషా పదాలను భద్రపరిచే ఒక నిల్వ పాత్ర లాంటిది కాబట్టే ఈ పుస్తకానికి ఆయన ‘‘గుమ్మి’’ అని పేరు పెట్టారు.తెలంగాణలో మనుషులు సహృదయాలు. వారి జీవితం నిర్మలమైనది. కల్మషం, కుట్ర కుతంత్రాలు ఎఱగనోళ్లు, వారి కార్యక్రమాల్లో ఎన్నో పలుకుబడులు నిత్యం తానం ఆడుతాయి. కొన్నింటిని పరిశీలిద్దాం; ఆన గొట్టి ఎల్సినట్టు (లొల్లి లొల్లి గా ఉండి ఒక్కసారి నిశ్శబ్దం ఆవరిస్తే), సెర్లనీల్లు సెరెనుక వడ్డాయి ( అంతా అయిపోయిందని తెలపటానికి), ఎరుకైందా! (నిజాన్ని తెలపటానికి), ఎప్పటి సిప్ప ఎన్నగల్లే (ఫలితం శూన్యం అయినందుకు), తేనత్తకున్న గుడ్డత్త నయం, (ఆశయవాదాన్ని వ్యక్తపరచటానికి), ఏందెల్వని ఎల్లపాయె గుర్గలేత్తె కరిగిపాయే (తెలిసే కూడా తెలియనట్లు నటిస్తే), నాలుక తాటిమట్టా (అబద్ధాలు మాట్లాడితే), మసివూసి మారేడు కాయసేసుడు (మోసం చేయటాన్ని) కండ్లల్ల కారం గొట్టనట్టు (నిజాల నిగ్గును తేల్చటానికి), గజ్జెల గుర్రం (కయ్యానికి), బసవన్న (అమాయకత్వానికి), కడ్డుగాడు (కఠినత్వానికి తెలపడానికి), కన్నట్టు (మాయాజాలం, ఇంద్రజాలం), కట్రౌతు (కట్టటానికి ఉపయోగించే రాయి), గత్కుడు (తాగటానికి ఉబలాట పడితే) గల్మ (కడప), గూబ గుయ్యిమీన్నీది, సెంప సెల్లుమనుడు, సిల్కనుసెప్పినట్లు,సెప్పెల రాయి, సెవుల జోరీగ, కంట్లె నలుసు, జెన్కం,తౌన్కం,జప్పున,జలకం, ఈపు ఇమానమై మోగింది,మెత్త, తంతె, మెట్టు, ఇలాంటివి అనేకం నిత్య జీవితంలో మన ముందు వాడబడే పదజాలం.తెలంగాణ పలుకుబడులలో తెలుగు భాష యొక్క ప్రాచీన రూపాలు కవిత పదాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి అని తెలుస్తుంది.

ఉదా: “తర్వాత” అనే పదానికి “అటెనక” అని

“స్పృహ” అనే పదానికి “సోయి” అని వ్యవహరిస్తారు.

ఈ విధంగా శబ్ద సౌందర్యాన్ని భావ తీవ్రతను అద్భుతంగా వ్యక్తపరుస్తాయి.తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన నిజాం పాలన మరియు దక్కని సంస్కృతి కారణంగా మన తెలంగాణ తెలుగు భాషలో చాలా ఉర్దూ, హిందీ పదాలు కలిసిపోయినాయి.


ఉదా: ఆసుపత్రిని – “దవాఖానా”

**అద్దెను – “కిరాయి” పరియాను – “జాగా”**

**1. అంగడి – సంత 2. యాది – జ్ఞాపకం**
**3. పెయ్యి – శరీరం 4. పత్తా – చిరునామా**
**5. సాలు – సరిపోవడం 6. పానం – ప్రాణం**
**7. పాశం – పాయసం 8. వెతలు – కష్టాలు**
**9. విముక్తి – స్వేచ్ఛ 10. తెగువ – ధైర్యం**
**11. చల్ల – మజ్జిగ 12. బువ్వ – అన్నం**
**13. వికారు – అసహ్యంగా 14. పోరి – చిన్నపిల్ల**
**15. వనరు – దొరికే స్థలం 16. పోరగాడు – చిన్నపిల్లోడు**
**17. తిర్రి – పిచ్చి 18. మొకం – ముఖం**
**19. వెలయాలు – వేశ్య 20. పయులం – జాగ్రత్త**

ఒకప్పుడు మన తెలంగాణ భాషను కేవలం సినిమాల్లో హాస్యానికి లేదా విలన్ పాత్రలకే పరిమితం చేసేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాహిత్యకారులు, కవులు, రచయితలు తమ తమ రచనల్లో, తెలంగాణ భాషలో రచనలు రాయడం జరిగింది. తెలంగాణ వాడుక భాష యొక్క ప్రాముఖ్యతను, ప్రత్యేకతను చాటుతూ పలుకుబడులను ప్రజలకి తెలియజేశారు. అదేవిధంగా ప్రసారాల మాధ్యమంలో భాగంగా ముఖ్యంగా టీవీ చానల్స్ లో చూసుకుంటే (ఉదా: వీ6 న్యూస్ – తీన్మార్ వార్తలు, మన తెలంగాణ భాషకు ఉన్న గొప్పతనాన్ని మాండలిక సొగసును ప్రపంచానికి చాటి చెప్పారు. ఇలాగే మరికొన్ని చానల్స్ లో కూడా తెలియజేస్తున్నాయి వాటిలో , ధూంధాం న్యూస్, మల్లన్న వార్తలు, పటాస్ వార్తలు, మరికొన్ని ఇతర టీవీ చానళ్ల మాధ్యమాల్లో తెలంగాణ భాష యొక్క పలుకుబడులు వినిపిస్తున్నాయి. అలాగే సినిమాలో కూడా చాలా వచ్చాయి. తెలంగాణ భాషతో, యాసతో, పలుకుబడులతో అని చెప్పవచ్చు. వాటిలో కొన్నిటిని తెలియజేస్తున్నాను. ఫిదా, బలగం, మల్లేశం, లవ్ స్టోరీ, జాతి రత్నాలు, డిజె టిల్లు, దసరా, భగవంత్ కేసరి, ఒసేయ్ రాములమ్మ, చిల్లర దేవుళ్ళు, మా భూమి, రుద్రమదేవి, జై బోలో తెలంగాణ, మరికొన్ని సినిమాలో కూడా వచ్చాయని తెలియజేయవచ్చు.

జాటావత్ రాజు
(యువ కవి, రచయిత)
9347196264 ,
తెలంగాణ
విశ్వవిద్యాలయం,
నిజామాబాద్



# ప్రతి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాం

**ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



**జననినాదం,నెరడిగొండ 13:**మండలంలోని ప్రతి కాలనీలో అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం నెరడిగొండ మండల కేంద్రంలోని న్యూ హనుమాన్ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్లు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ రికార్డు విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 13:** తైక్వాండో, కరాటే విభాగాల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిన విద్యార్థులను కలెక్టర్ కె. హరిత ఘనంగా సన్మానించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు, పతకాలను కలెక్టర్ అందజేశారు. సెంట్ క్లారిటీ స్కూల్‌కు చెందిన కె. నవనీత్ చంద్ర, ఫాతిమా కాన్వెంట్‌కు చెందిన విద్యార్థులతో పాటు కట్కూరి శ్రీనాథ్, కె. అశ్విత్ యాదవ్‌లు కలెక్టర్ చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తైక్వాండో, కరాటే వంటి క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించి జిల్లా ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై నిలబెట్టిన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్‌వో) అష్ఫాక్ అహ్మద్, ఖేలో ఇండియా కోచ్ కడతాల రాకేష్, జిల్లా కార్యదర్శి ఎం. దేవయ్య, అధ్యక్షుడు వి. రవి మాట్లాడుతూ విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తే మరిన్ని విశేష విజయాలు సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 13:** జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కె. హరితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి. సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శి పర్వతి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, తక్కువ వేతనాలతో పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోతే టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. నాగేందర్, కోశాధికారి జె. లలిత్ కుమార్, సభ్యులు జె. మధుకర్, బి. కిరణ్ కుమార్,ముఖాషీర్ పాషా, ఎం. యాదగిరి, బి. వెంకన్న, పి. సంతోష్, ఎం.డి. ఇసాక్, ధనుంజయ్, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి**

**కాంగ్రెస్ మండల నాయకుడు కొట్నాక గణపతి**



**జననినాదం, తిర్యాణి 13:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల నాయకుడు కొట్నాక గణపతి అన్నారు. సోమవారం తిర్యాణి మండలంలోని పంగిడి మాదార గ్రామంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), బీఎల్ఏలు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే మూలస్తంభమని పేర్కొన్నారు. గత ఓటర్ల జాబితాల్లో డూప్లికేట్ పేర్లు, మృతుల పేర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు కొనసాగిన నేపథ్యంలో ఈసారి అలాంటి లోపాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. అర్హుల పేర్లను మాత్రమే జాబితాలో చేర్చి, అనర్హుల పేర్లను తొలగించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నందున గ్రామస్థులు పూర్తి సహకారం అందించి అవసరమైన దరఖాస్తులు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చిక్రం సోమేశ్‌కుమార్, బీఎల్‌వో కోవా పుష్పలత, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాస స్థాయికి అనుగుణంగా బోధన అందించాలి

**ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి**

**పి.ఎం.ఆర్.సి. ఏ.సి.ఎం.ఓ. పూర్కా ఉద్ధవ్**



**జననినాదం,ఆసిఫాబాద్ 13:** ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) బేస్‌లైన్ పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యాస స్థాయిని కచ్చితంగా గుర్తించి, వారి నేర్చుకునే సామర్థ్యానికి అనుగుణంగా బోధన అందించాలని పి.ఎం.ఆర్.సి. ఏ.సి.ఎం.ఓ. పూర్కా ఉద్ధవ్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆసిఫాబాద్, మొవాడ్, వాంకిడి పాఠశాల సముదాయాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ పరీక్షలు విద్యార్థుల విద్యా ప్రగతిని అంచనా వేయడానికి కీలకమని, పరీక్షలను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు పవార్ లింబారావ్, మాడుగుల నారాయణమూర్తి, సోయం ఇంద్ర మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఎస్‌సీఆర్‌పీలు రాథోడ్ రవీందర్, కుడ్మేత అనంత్ బేస్‌లైన్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం, రికార్డుల నిర్వహణ, ఫలితాల విశ్లేషణపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు పాఠశాల సముదాయాలకు చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 13:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్ మల్లికార్జున్ తో కలిసి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 24వ తేదీ లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మండలంలోని సోమనపల్లిలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. చెన్నూర్ పట్టణంలో నిర్మిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు నిరంతరంగా త్రాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 13:** విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం కొలాంగూడ (పి) గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో 38 లక్షల 15 వేల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో పాఠశాల భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ సదుపాయాలు కల్పించడం తో పాటు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో అదనపు గదులు, భోజనశాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయలతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ప్రాణాలతో చెలగాటం..!

**అర్జున్‌లొద్ది అంగన్‌వాడీ భవన నిర్మాణంలో నాసిరకం పనులు**

**పర్యవేక్షణ కరవై.. గాలికి వదిలేసిన అధికారులు**

**ప్రారంభానికి ముందే బీటలు వారేలా నిర్మాణం**



**జననినాదం, తిర్యాణి 13:** చిన్నారుల తొలి పాఠశాల.. అక్షరాభ్యాసం నుంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదల వరకు ప్రతి అడుగుకు పునాది వేసే అంగన్‌వాడీ కేంద్రం. భవిష్యత్తు తరాలకు పునాది కావాల్సిన అంగన్‌వాడీ కేంద్రం.. నేడు నాణ్యత లేని నిర్మాణంతో చిన్నారుల పాలిట ప్రమాద ఘంటికలా మారుతోంది. తిర్యాణి మండలంలోని అర్జున్‌లొద్ది గ్రామంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను పక్కనబెట్టి, కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారని, అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేదని వారు మండిపడుతున్నారు.

**నాణ్యతకు తిలోదకాలు..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ఇసుక, నిర్ణీత మోతాదులో సిమెంట్ వాడాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. నాసిరకమైన ఇసుకను వినియోగిస్తూ, సిమెంట్ వాడకంలోనూ పొదుపు పాటిస్తుండటంతో పునాదులు, పిల్లర్ల నిర్మాణం అస్థిరంగా తయారవుతోంది. భవనం పూర్తికాకముందే అక్కడక్కడా చిన్నపాటి పగుళ్లు కనిపిస్తుండటంతో, ఇదేనా చిన్నారులకు భద్రత అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనం.. కాంట్రాక్టర్ల హవా...**

గిరిజన గ్రామాల్లో జరిగే పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిని పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో, కాంట్రాక్టర్లు అడ్డగోలుగా పనులు పూర్తి చేసే పనిలో ఉన్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇలాంటి నాసిరకం భవనాన్ని రేపు చిన్నారులకు అప్పగిస్తే, వారి ప్రాణాలకు భద్రత ఎక్కడిదని వారు ప్రశ్నిస్తున్నారు.

**నిపుణులతో విచారణ జరపాలి**

పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి. తక్షణమే సాంకేతిక నిపుణులతో (టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్) భవనాన్ని తనిఖీ చేయించి, లోపాలు ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని అర్జున్‌లొద్ది గ్రామస్తులు డిమాండ్ చేశారు. నాణ్యత లేని పనులను నిలిపివేసి, ప్రమాణాలకు అనుగుణంగా భవనాన్ని పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

# కొమురం భీం విగ్రహానికి రూ.1 లక్షల విరాళం



**జననినాదం,ఖానాపూర్ 13:** సిరికొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కొమరం భీం విగ్రహ నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ రూ.1 లక్షల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన, ఆదివాసీల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొమరం భీం వంటి పోరాట యోధుల చరిత్రను చిరస్థాయిగా నిలబెట్టేందుకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. విరాళం అందజేసిన సందర్భంగా స్థానిక గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460